క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాజువాక: కర్ణవానిపాలెంలోని 132 కేవీ విద్యుత్ తీగల నిర్వహణ పనులను సోమవారం చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీనగర్, కర్ణవానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న పైడిరెడ్డి, అప్పలరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని 77వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టు పైడిరెడ్డి అన్నారు. మరడ దాసరి పేటలోని వరసిద్ధి వినాయక ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యహవచనం, పంచగవ్యం, నీరాజన మంత్రపుష్పం తదితర విశేష పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బుట్టు పైడిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు బుట్టు అప్పల రెడ్డి, డి. తాతారావు, డి. నాయుడు, చిన్నా రావు, పి. వెంకటరెడ్డి, పిట్ట సంజీవరెడ్డి, బి. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో మనుగడ



ప్రదర్శన నిర్వహిస్తున్న తిరుమలనగర్‌వాసులు

కూర్మన్నపాలెం: పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ తిరుమలనగర్ వాసులు ఆదివారం కాలనీలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని, పరిసరాల శుభ్రత పాటించాలని నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల.. అపరిశుభ్రత వల్ల అనేక వ్యాధులు విజృంభిస్తాయన్నారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు పరమేశ్వరరావు, వసంత రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మానవాళి రక్షణలో మడ అడవులు కీలకం



విద్యార్థులకు మడ అడవులు, పులుల గురించి వివరిస్తున్న సీతా శ్రీనివాస్

తాటిచెట్లపాలెం: మానవాళిని రక్షించడంలో మేంగ్రోవ్స్ పాత్ర కీలకమని కథాకథన శిల్పి, వాయిస్ ఆర్టిస్ట్, రికార్డిస్ట్ ఎస్.సీత శ్రీనివాస్ అన్నారు. భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్‌తో కలిసి విశాఖ పబ్లిక్ లైబ్రరీ మియావాకి స్టోరీటైమ్ వీకెండ్ యాక్టివిటీలో భాగంగా ఆదివారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇటీవల జూలై 26న అంతర్జాతీయ మడ అడవుల సంరక్షణ దినోత్సవం, జూలై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరిగాయని, మానవ చరిత్రను రక్షించడంలో మేంగ్రోవ్స్, పులుల ప్రాధాన్యం ఎంతో ఉందని తెలిపారు. మడ అడవులు ప్రకృతి తీర రక్షకులుగా ఎలా తీరాలను కాపాడతాయో, నేల క్షీణతను తగ్గిస్తాయో, జలచరాలు, పక్షులకు ఆశ్రయంగా ఉంటాయో పిల్లలకు వివరించారు. ఇవి రాబోయే తరాల భద్రతకు ఎంత ముఖ్యమో తెలియజేశారు. పులి శక్తికి, పర్యావరణ సమతుల్యతకు చిహ్నంగా ఎలా ఆహార గొలుసులో కీలకపాత్ర పోషిస్తుందో, దాని సంరక్షణ ఎందుకు అవసరమో వివరించారు. పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డి.ఎస్.వర్మ మాట్లాడుతూ మడ అడవులను సంరక్షించుకుంటే భవిష్యత్‌కు రక్షణగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీల్ చైర్ అందజేత

దాబాగార్డెన్స్: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా అలయన్స్ క్లబ్ (నార్త్) విశాఖ శాఖ ఆదివారం రెండు కాళ్లు కోల్పోయి మంచాన పడిన ఓ వ్యక్తికి వీల్ చైర్ అందజేశారు. కెల్ల గ్రామానికి చెందిన అంబల్ల రామకృష్ణ రెండు కాళ్లు కోల్పోయి గత పదిహేనేళ్లుగా మంచాన పడిన విషయం తెలుసుకుని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సభ్యులు కెల్ల గ్రామానికి వెళ్లి రామకృష్ణకు వీల్ చైర్ అందజేశారు.

మూగనోము!

మూగజీవాలకు వైద్యం అందించే ఆస్పత్రి శిథిలమైంది. ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో ఉంది. వర్షం వస్తే కారిపోయి సిబ్బంది అవస్థలు వర్ణనాతీతం. మందులు తడిచిపోతున్నాయి. దీంతో గత ప్రభుత్వం పశువైద్యశాలకు స్థలం కేటాయించింది. ఆ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం ఆస్పత్రి గురించి పట్టించుకోలేదు. దీంతో మూగజీవాలకు వైద్యం దైవాదీనంగా మారింది. – అగనంపూడి

- శిథిలావస్థలో పశువుల ఆస్పత్రి
- బితుకుబితుకు మంటున్న సిబ్బంది
- సేవలూ అంతంతమాత్రమే
- స్థలం కేటాయించినా పట్టించుకోని కూటమి ప్రభుత్వం



శిథిలమైన అగనంపూడి పశువుల ఆస్పత్రి

మూడు వార్డుల్లోని సుమారు మూడు వేల మంది పాడి రైతులకు అందుబాటులో ఉన్న అగనంపూడి పశువుల ఆస్పత్రి శిథిల వసతిలోనే నెట్టుకొస్తుంది. పంచాయతీ నాటి పెంకుటిల్లు శిథిలావస్థకు చేరినా అదే ప్రాంగణంలో నడుస్తోంది. మూడున్నర దశాబ్దాల కిందట అగనంపూడి సర్వే నంబర్ 115లోని పది సెంట్ల స్థలంలో పశువైద్యశాల ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అదే ఆవరణలో కొనసాగుతోంది. అయితే వసతి దాదాపు శిథిలం కాగా ఒక గదిలో పశు వైద్యశాల కొనసాగిస్తున్నారు. మహానేత వైఎస్ రాజశేఖరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా పశువైద్యశాల నిర్మాణానికి నిధులు కేటాయించారు. స్థలం కేటాయింపులు జరిగేలోగా ఆయన మరణంతో నిధులు మురుగుపోయాయి. అప్పటి నుంచి ప్రజా సంఘాలు జిల్లా అధికారులకు, పాలకులకు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం పశువైద్యశాల స్థలం ఉక్కు భూసేకరణ విభాగానికి చెందింది. తర్వాత జీవీఎంసీకి అప్పగించింది. ఈ క్రమంలో నాటి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లతో చర్చించి పది సెంట్ల స్థలాన్ని పశువైద్య శాల భవన నిర్మాణానికి కేటాయించారు. విశాఖ జిల్లా కలెక్టర్ వెటర్నరీ ఆస్పత్రికి స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జీవీఎంసీ నిరభ్యంతర పత్రం ఇవ్వడంలో అలసత్వం వహించడంతో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కలుగజేసుకొని స్థలం కేటాయింపులు చేయించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో నిర్మాణ పనులు జరగలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పశువైద్యశాల కోసం పట్టించుకోలేదు.

వేలాది మూగజీవాలకు ఇక్కడే వైద్యం

ఈ ఆస్పత్రికి వెదుళ్లనరవ, దువ్వాడ, నంగినారపాడు, కూర్మన్నపాలెం, వడ్లపూడి, గంగవరం, మంగళపాలెం, ఏడుమెట్ల మత్రిపాలెం, వడ్లపూడి, గొన్నవానిపాలెం, లంకెలపాలెం, పెద ముషిడివాడ గ్రామాలతో పాటు సబ్బవరం, పరవాడ, గాజువాక మండలాల్లోని గ్రామాల నుంచి పాడి రైతులు, పెంపుడు జంతువులను వైద్యం కోసం, వ్యాక్సిన్ల కోసం ఇక్కడికి తీసుకు వస్తున్నారు. సరైన వసతి లేకపోవడంతో ఇక్కడికి వచ్చేవారు కూడా ఆరుబటయే శిథిల ఆవరణలో బిక్కుబిక్కుమంటూ వేచి ఉండాల్సి వస్తోంది.

పాడి రైతులను దృష్టిలో పెట్టుకోవాలి



అగనంపూడికి పరిసర మండలాల నుంచి రైతులు పశువులను తీసుకు వస్తున్నారు. ఎప్పుడు కూలిపోతుందోననే భయాందోళనతో ఆవరణలోకి అడుగు పెట్టాల్సి వస్తుంది. స్థానిక ఎమ్మెల్యే కలుగజేసుకొని పశువైద్యశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటే తప్పా పాడి రైతులకు ఇబ్బందులు తప్పవు.

–వుడా సత్యనారాయణ, అగనంపూడి

సిబ్బంది, రైతుల అవస్థలు



శిథిల భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మించాలి. విశాలమైన ఆవరణ ఉండి కూడా ప్రజా ధనం వెచ్చించడానికి ప్రభుత్వం ఎందుకు ఆలోచిస్తుంది. అరకోటి వెచ్చిస్తే వేలాది మంది రైతులు, పెంపుడు జంతువులకు వైద్యం అందించడానికి వీలుంటుంది. ప్రభుత్వ పెద్దలు పాడి రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోవాలి. వెంటనే నిర్మాణానికి నిధులు కేటాయించాలి.

–యలమంచిలి పెద అప్పారావు, దిబ్బపాలెం

ఇన్‌చార్జి మంత్రికి వినతి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయులను స్థానిక ప్రజా సంఘాల నాయకులు కలిసి పశు వైద్యశాల నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. అయితే స్థానిక ఎమ్మెల్యే స్పందించి పాడి పరిశ్రమల శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తే తప్పా నిర్మాణం జరిగే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గాజువాక: మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 35 ఏళ్ల కిందట కలిసి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా 1990–1991 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 60 మంది విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో కలుసుకొని సందడి చేశారు. భారత దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారితోపాటు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా ఈ సమ్మేళనంలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. చదువుకున్నప్పటి రోజులను, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పలువురు పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు జగన్నాథం మాస్టారు దంపతులు, కె.అప్పలరాజు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. తమ బ్యాచ్‌లో మృతి చెందిన తొమ్మిది మందికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులు గుండుబిల్లి శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, చుక్క శ్రీనివాస్, పిలక త్రినాథ్, గుంటూరు అనురాధ, జానకి రామయ్య, షేక్ అలీ, గుజ్జు శ్రీరామరెడ్డి, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టండి

సీపీఐ నాయకుల డిమాండ్



భూ ఆక్రమణలను పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలో భూ ఆక్రమణలపై తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఐ గాజువాక పట్టణ కార్యదర్శి కె.అచ్యుతరావు డిమాండ్ చేశారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కూర్మన్నపాలెం సర్వేనెంబర్ 27లోని ఆక్రమిత భూములను ఆదివారం సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి చెందిన గెడ్డలు, వాగులు ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేస్తుంటే రెవెన్యూ అధికారులు చేష్టలుడిగి చూడడం సమంజసంగా లేదన్నారు. అధికారులు తూతూ మంత్రంగా పరిశీలించి చర్యలు తీసుకోకుండా కట్టడాలను అలాగే వదిలేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.తక్షణమే ఆక్రమిత భూముల్లో నిర్మించిన షెడ్లు కూల్చివేయాలని డిమాండ్ చేశారు. అలాగే అక్రమార్కులపై క్రిమినల్ కేసులు చేయాలని ఆయన కోరారు. 5.48 ఎకరాల భూమి పోరంబోకు, వాగు అని అధికారులే చెప్పినప్పుడు చర్యలకు ఎందుకు వెనుకాడుతున్నారని ఆయన ప్రశ్నించారు. అధికారులు స్పందించక పోతే తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు.సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యురాలు కె.వనజాక్షి పాల్గొన్నారు.

సందడిగా స్నేహితుల దినోత్సవం



సందడి చేస్తున్న స్నేహితులు

పెదగంట్యాడ: స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మార్టుపూడి పరదేశి, ధర్మాల శ్రీను, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, సంపంగి ఈశ్వరరావు, పిట్టా రెడ్డి, ఎస్.రాజారావు, వాసా అప్పలరెడ్డి, వెంకటేష్, మంగునాయుడు, చంద్రయ్య పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాల్సిందే..



దుకాణాలు తొలగించాలని ఆందోళన చేస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని గాంధీనగర్ ఆర్చి వద్ద, చిన నడుపూరు నూకమాంబ ఆలయం వెనుక ఉన్న గెడ్డ స్థలంలో ఆక్రమణలను తొలగించాలని చిననడుపూరు గ్రామస్తులతో పాటు నూకమాంబ ఆలయ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం తమ భూములు, ఇళ్లతో పాటు రామాలయం, నూకమాంబ ఆలయం, స్కూల్ కోల్పోయామని వివరించారు. అయితే తర్వాత ప్రభుత్వం ఆలయాలు, స్కూల్ కోసం స్థలం కేటాయించిందని వివరించారు. ఆ స్థలంలోనే నూకమాంబ ఆలయం నిర్మించామన్నారు. ఏటా పెద్ద ఎత్తున అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. అయితే ఆలయానికి ఆనుకొని ఉన్న గెడ్డ స్థలం ఖాళీగా ఉండడంతో కొంతమంది ఉపాధి కోసం చిన్న చిన్న షెడ్లు నిర్మించుకుంటామని చెప్పడంతో అనుమతులు ఇచ్చామన్నారు. అయితే తమ అవసరాల కోసం రెండు నెలల ముందు దుకాణాలు ఖాళీ చేయాలని షరతు విధించామన్నారు. దాని ప్రకారం ప్రభుత్వం ఇక్కడ గెడ్డకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించేందుకు టెండర్ ఖరారు చేసిందన్నారు. దుకాణాలు ఖాళీ చేయించి గెడ్డ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇందల ఈశ్వరరావు, నాగిరెడ్డి పెద వెంకటరమణ, నాగిరెడ్డి అప్పలనాయుడు, నాగిరెడ్డి రాంబాబు, రౌతు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ విశాఖలో భాగస్వాములవుదాం



వాకింగ్ ట్రాక్‌లో చెత్తాను సేకరించిన వాకర్స్

అగనంపూడి: స్వచ్ఛ విశాఖలో అందరూ భాగస్వాములు కావాలని శానిటరీ సూపర్‌వైజర్ ఎం.కోటేశ్వరరావు కోరారు. అగనంపూడి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ వాకింగ్ ట్రాక్ చేపట్టారు. ఈ సందర్భంగా వాకింగ్‌ట్రాక్‌లో చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు, గాజువాక సీసాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లోభాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా గాజువాక జోన్ శానిటరీ సూపర్‌వైజర్‌గా నియమితులైన కోటేశ్వరరావు, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి సహకరిస్తున్న రావి చలపతిరావులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, గవర సోమశేఖర్, వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడుగల నరసింగరావు, ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కె.వి.నాయుడు, జి.బాబూరావు, బి.శంకరరావు, సురేష్, నూకరాజు, బి.రామారావు, కె.పైడిరాజు, చిన్ని, పూర్ణ, అనిత పాల్గొన్నారు.

తత్కాల్ టికెట్‌కు ముందు రోజు పేరు నమోదు

మరుసటిరోజు క్యూలో ఉంటే చాలు



దువ్వాడ రైల్వేస్టేషన్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో తత్కాల్ టికెట్ తీసుకోవాల్సిన ప్రయాణికులు ముందురోజు రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన పత్రంపై పేరు, సీరియల్ నంబర్, ఆధార్ నంబర్ రాసి తర్వాత రోజు టికెట్ కోసం క్యూలో ఉంటే సరిపోతుంది. ఈ విధానం దువ్వాడ రైల్వేస్టేషన్ అధికారులు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే తత్కాల్ టికెట్లను ముందు రోజు జారీ చేస్తారు. వాటి కోసం అదేరోజు తెల్లవారుజాము నుంచి ప్రయాణికులు స్టేషన్ వద్ద పడిగాపులు కాస్తుంటారు. దీంతో ప్రయాణికులు తోపులాటకు దిగుతుండడంతో దువ్వాడ రైల్వే కమర్షియల్ అధికారి ఎం.ఎస్.రావు చొరవ తీసుకొని ముందురోజు రాత్రి 9.30 పది గంటల మధ్యలో అధికారికంగా ఒక పేపర్ ఏర్పాటు చేస్తున్నారు. వాటిపై పేర్లు, ఆధార్ నంబర్ రాసి పెట్టి మరుసటిరోజు ఉదయం కౌంటర్ తెరవకముందు వస్తే సీరియల్ నంబర్ ప్రకారం పిలిచి టికెట్లు జారీ చేస్తున్నారు. దీంతో ఎవరు నమోదు చేశారో వారికే టికెట్ అందుతుండడం, ఏజెంట్ల హడావుడి లేకుండా ఆర్పీఎఫ్ సహకారంతో సజావుగా టికెట్ల జారీ ప్రక్రియ సాగుతుండడంతో ప్రయాణికులు హర్షిస్తున్నారు.

భౌపెడుతున్నాయ్..

- గుంపులుగా కుక్కల సంచారం
- వణికిపోతున్న చిన్నారులు, వృద్ధులు
- పట్టించుకోని అధికారులు



మదీనాబాగ్‌లో దుకాణాల వద్ద కుక్కలు

పెదగంట్యాడ: మండల వ్యాప్తంగా వీధి కుక్కల బెడద తీవ్ర రూపం దాల్చింది. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలు ప్రజలను, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రోడ్లపై నడవాలంటే భయమేస్తోందని, నిత్యం తిరిగే ప్రాంతమైనా అప్రమత్తంగా ఉండాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి మరింత భయానకంగా తయారైంది. కుక్కలు వెంటపడి కరుస్తున్నాయని, ముఖ్యంగా పిక్కలు పట్టుకుంటున్నాయని బాధితులు వాపోతున్నారు. వాహనాలపై వెళ్లేవారికి రోడ్డుకు అడ్డంగా వచ్చి మీద పడుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దారిన వెళ్లే వారిని వెంబడించడంతో వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. మండలంలోని ఇస్లాంపేట, మదీనాబాగ్, నడుపూరు, సిద్దేశ్వరం, దయాల్‌నగర్, నెల్లిముక్కు, బాలచెరువు, దుర్గవానిపాలెం, సీతానగరం, హౌసింగ్‌బోర్డు కాలనీ, బర్మా కాలనీ వంటి ప్రాంతాల్లో వీధి కుక్కల గుంపులు స్వేచ్ఛగా తిరుగుతూ ప్రజలకు నిద్రపట్టకుండా చేస్తున్నాయి.

పెరుగుతున్న కుక్క కాటు కేసులు

ఇటీవలి కాలంలో ఈ మండలాల్లో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం, వాటి దాడులు ఎక్కువవడం వల్ల కుక్క కాటు కేసులు కూడా గణనీయంగా పెరిగాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల గణాంకాలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు 50 నుంచి 60 కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. సిద్దేశ్వరం యూపీహెచ్‌సీలో నెలకు 28 నుంచి 30 కేసులు నమోదవుతుండగా.. గంగవరంలో 10 నుంచి 15 కేసులు, దేవాడ పీహెచ్‌సీలో నెలకు 25 వరకు కేసులు, నమ్మిదొడ్డి యూపీహెచ్‌సీలో 30 వరకు కేసులు నమోదవుతున్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట కుక్క కరిచిందని బాధితులు పీహెచ్‌సీలకు పరుగులు తీస్తున్నారు. ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వీధి కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అలరించిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

తాటిచెట్లపాలెం: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు అలరించింది. ఎం.వి.సుబ్రహ్మణ్యం, ప్రకాష్, దేవిడ్‌రాజ్, కుమారి, పుష్పమ రాగస్ నాయుడు, నరసింహరావు, సూర్య, ఎస్ఎస్ నాయుడు, పోర్ట్ శేషులు లఘు నాటికలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శేఖర్ కుమార్ అందించిన హాస్య గుళికలు వినోదాన్ని పంచాయి. ఓం శ్రీ గురు నృత్య కళానికేతన్ శిష్యులు శాస్త్రీయ నృత్యం చేసి అలరించారు. అనంతరం అతిథులకు, కళాకారులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, బి.మాల్యాద్రి, రిటైర్డ్ డీజీఎం డాక్టర్ మీగడ శశిభూషణ స్వామి, ఎం.వి.సుబ్రహ్మణ్యం తదతరులు పాల్గొన్నారు.

బుద్ధిగా ప్రవర్తిస్తే.. మంచి భవిష్యత్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ భాస్కరరావు

పెందుర్తి: రౌడీ షీటర్లు బుద్ధి మార్చుకుని, మంచిగా ప్రవర్తిస్తే వారి భవిష్యత్ బాగు చేసుకునే అవకాశం కల్పిస్తామని ఎస్ఐ ఎస్‌వీ భాస్కరరావు అన్నారు. సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని హెచ్చరించారు. చెడు ప్రవర్తన తమతో పాటు, తమ కుటుంబాలూ నాశనమవుతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని వివరించారు. పలు సూచనలు చేశారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం ఈ సేవను నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

గురుద్వారాను సందర్శించిన పోలీస్ కమిషనర్



చిన్నారులకు ప్రసాదం అందిస్తున్న సీపీ బాగ్చీ

మల్కాపురం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ఉదయం సింధియా న్యూకాలనీలోని సిక్కుల ఆరాధ్య దైవం గురునానక్ మందిరమైన గురుద్వారా దర్బార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మత పెద్దల ఘన స్వాగతాన్ని అందుకున్నారు. మందిరంలో సిక్కులతో కలిసి పవిత్ర ప్రార్థనలు చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా దర్బార్‌లో భక్తులకు సీపీ శుభకాంక్షలను తెలిపారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించి, వారికి చాక్లెట్లు, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మైనారిటీల సంరక్షణకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. స్థానికంగా ఏ సమస్య వచ్చినా తక్షణం 79950 95799 నంబర్‌లో తనను సంప్రదించాలన్నారు. అనంతరం సిక్కు మత పెద్దలు సీపీ బాగ్చిని ఘనంగా సత్కరించారు. సిక్కు మతస్తులు, మల్కాపురం పోలీస్ స్టేషన్ సీఐ గొలగాని అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్య కళలను ప్రోత్సహించాలి

తాటిచెట్లపాలెం: భారతీయ సంప్రదాయంలో భాగమైన నృత్య కళలను తప్పనిసరిగా ప్రోత్సహించాలని ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ అన్నారు. శంకరమఠం ఎదురుగా గల పద్మశాలి భవన్‌లో ఆదివారం శ్రీ నటరాజ నృత్యనికేతన్ వ్యవస్థాపకుడు, నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ సారథ్యంలో విద్యార్థినులచే ఘనంగా గజ్జె పూజ చేయించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నృత్య కళాకారులతోనే సాంస్కృతిక వైభవం కలుగుతుందన్నారు. కళాకారుల కోసం నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో కె.సన్యాసిరావు, టి.వెంకటేశ్వర్లు, కె.సత్యనారాయణ, బి.పి.ఎస్.కల్యాణి, వి.కృష్ణమోహన్, విద్యార్థినులు, వారి తల్లితండ్రులు, భక్త మార్కండేయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.